క్లుప్తంగా

యువత చేతుల్లోనే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న జిల్లా అధికారి శ్రీనివాస్

ముదిగొండ: సమాజ అభివృద్ధి యువత చేతుల్లోనే ఉందని ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా పోగ్రాం అధికారి శ్రీనివాస్ అన్నారు. మేరా భారత్ కార్యక్రమంలో భాగంగా ముదిగొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కళాశాల పోగ్రాం అధికారి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల రుణమాఫీ వట్టిమాట

కొణిజర్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామన్న హామీని విస్మరించిందని భారతీయ కిసాన్ సంఘం ఖమ్మం జోన్ కార్యదర్శి మందనపు రామారావు అన్నారు. శుక్రవారం మండలంలోని తనికెళ్లలో భారతీయ కిసాన్ సంఘం(బీకేఎస్) నూతన మండల కమిటీని ఎన్నుకోగా.. మండల అధ్యక్షుడిగా బండారు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పెద్దమళ్ల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కొండపర్తి నరేష్, కవిడ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఈఓ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

బోనకల్: మహిళా రైతు పాల ఉత్పత్తిదారుల సీఈఓ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కంపెనీ చైర్మన్ షేక్ రెహానా, ఏపీఎం పద్మలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీస విద్యార్హత అగ్రికల్చర్ బీఎస్సీ, అగ్రికల్చర్ బిజినెస్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్ మార్కెటింగ్ డిప్లమా తత్సమాన అర్హతలు కలిగి, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. 35సంవత్సరాలలోపు వయస్సు ఉన్నవారు ఈ నెల 28న ఐకేపీ కార్యాలయంలో తరఖాస్తు చేసుకోవాలన్నారు. తరఖాస్తు చేసుకునేవారి కుటుంబం ఎఫ్‌పీసీలో వాటాధనం కలిగి ఉన్నవారికి మొదటి ప్రాధన్యత ఇవ్వబడుతుందన్నారు.

రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడిగా మాన్‌సింగ్

తల్లాడ: తల్లాడ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా మాలోత్ మాన్ సింగ్‌ను శుక్రవారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. తల్లాడలో రేషన్ డీలర్ల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఇనుపనూరి కృష్ణ, ఉపాధ్యక్షుడిగా సూదా రఘు, కోశాధికారిగా షరాబు మణికంఠ, మహిళా కార్యదర్శిగా నాగండ్ల జ్యోతి లను ఎన్నుకున్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

బోనకల్: మండలంలోని కలకోట గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పేదలకు దుస్తులను పీసీసీ సభ్యులు పైడివల్లి కిశోర్, సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు పంపిణీ చేశారు. అనంతరం కల్వరి టెంపుల్ పాస్టర్ సుంకర ఏసుబాబు కేక్‌కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా శక్తి స్టాల్ ప్రారంభం



ప్రారంభిస్తున్న ట్రైయినీ ఎస్సై రమేష్

చింతకాని: మండలంలోని నాగులవంచలో మహిళా సంఘ సభ్యులు ఏర్పాటు చేసుకున్న టీ స్టాల్‌ను ట్రెయినీ ఎస్సై రమేష్ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. మహిళా సంఘ సభ్యులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం తిరుమలరావు, సీసీ మమత, ఏపీజీవీబీ నాగులంచ మేనేజర్ అనీల్‌కుమార్, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

సత్తుపల్లి/కారేపల్లి: పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అవమానించారని, ఎగతాళి చేసి అహంకారంతో మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్, మాల మహానాడు మండలాధ్యక్షుడు రాములు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా కారేపల్లిలోని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అట్టడుగు వర్గాలపట్ల బీజేపీ వైఖరి తెలిసిపోయిందని పేర్కొన్నారు. ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ వద్ద నిరసన తెలపటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో దేవ ప్రకాశ్, మైప వీరయ్య, తలారి చంద్రప్రకాశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

అమ్మహస్తం అమలు ఎప్పుడు?

- పేదలకందని తొమ్మిది రకాల సరుకులు
- ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసరాల ధరలు
- పథకం అమలు చేయాలని పేదలు వేడుకోలు

ముదిగొండ: రాష్ట్రం విడిపోయింది.. ప్రభుత్వం మారిపోయింది. ఇక ఎలాగూ ఈ పథకం ఎత్తివేస్తారని అనుకున్నారో ఏమో! ఎటువంటి ఉత్తర్వులు లేకుండానే అమ్మహస్తం పథకానికి అధికారులు చెల్లుచీటి చెప్పేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో నిరుపేదలకు రూ.185లకే తొమ్మిది రకాల సరుకులు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మహస్తం పథకాన్ని ప్రారంభించింది. 2015నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత కొద్ది రోజులు అమలు పరిచి ఆ పథకాన్ని విస్మరించింది. పేదలకు నిత్యావసర సరుకులు అందిస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం పేదలకు చేరకుండా పోయింది.

ప్రకటనలకే పరిమితం..

గత ప్రభుత్వంలో అమ్మహస్తంప పథకం ప్రకటనలకే పరిమితమయిందని.. నిరుపేదల కోసమే పథకం ప్రవేశపెట్టి వదిలేశారని పలువురు ఆరోపిస్తున్నారు. తొమ్మిది రకాల సరుకులు జాడ దరిదాపుల్లో కనిపించకుండా పోయింది. ముదిగొండ మండలంలోని నిరుపేదలకు తక్కువ ధరకే నిత్యవసర వస్తువులను అందించే అమ్మహస్తం పథకాన్ని అప్పటి శాసనసభ ఉపసభాపతిగా ఉన్న మల్లుభట్టివిక్రమార్క మధిర నియోజకవర్గంలో ప్రారంభించారు. ముదిగొండ మండలంలోని 25గ్రామపంచాయతీల్లో 33గ్రామాలుండగా.. వాటిల్లోని 37 రేషన్ దుకాణాల్లో 18వేల తెల్లరేషన్‌కార్డులు ఉన్నాయి. వీరందరికి పూర్తిస్థాయిలో సరుకులు అందించాలని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.



సువర్ణాపురంలోని రేషన్ దుకాణంలో బోర్డు

కొండెక్కిన ధరలు..

నిత్యావసర వస్తువుల ధరలు కొండెక్కడంతో పేదలు పాత పథకాన్ని మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుత



ముదిగొండలోని తహసీల్దార్ కార్యాలయం

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆలోచనల విధానంతో పేదలకు దొమ్మిది రకాల సరుకులతో పాటు.. పెరిగిన జనాభా ప్రాతిపదికన నూతన రేషన్ కార్డులు జారీ చేయాలని నిరుపేదలు ఎదురు చూస్తున్నారు. బయట డబ్బులు వెచ్చించినా నాణ్యమైన సరుకులు అందని పరిస్థితి.. అమ్మహస్తం పథకంలో పామాయిల్, కందిపప్పు, పంచదార, పసుపు, గోదుమపిండి, గోదుములు, ఉప్పు, కారం, చింతపండు అందించాలని కోరుతున్నారు. ఈ ప్రభుత్వంలోనైనా అన్ని పథకాలతో పాటు అమ్మహస్తం పథకాన్ని అమలు చేయాలని పేదలు కోరుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పథకాలు అమలు..



పేదలకు తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు రూ.185లకే అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కింది. ఆనాటి పథకం మళ్లీ అమలు చేయాలి. బయట అధిక రేట్లు ఉన్నందున ప్రభుత్వం పేదలకు రేషన్ దుకాణాల ద్వారా అందిస్తే బాగుంటుంది.

– మొక్క సైదమ్మ, బాణాపురం

ధరలు విపరీతంగా పెరిగాయి..



కూలీ పనులకు వెళ్లే మా లాంటి పేదలకు నిత్యావసరాలు పెరగడంతో ఇల్లు గడవటం భారంగా మారింది. మార్కెట్లో ఏది కొనాలన్నా ధరలు మండిస్తున్నారు. ఇకనైనా మాలాంటి పేదల కోసం అమ్మహస్తం పథకం అమలు చేసి.. రేషన్ దుకాణాల ద్వారా సరుకులు అందించాలి.

– గుగులోత్ ఉమాదేవి, గోకినేపల్లి

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలి

కల్లూరురూరల్/తల్లాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని కల్లూరు ఆర్డీఓ రాజేందర్‌గౌడ్ ఆదేశించారు. కల్లూరు మండలంలోని హనుమాన్తండా, గన్యాతాండల్లో, తల్లాడలోని.. రంగంబంజర, నూతనకల్, మల్సూర్‌తండా గ్రామాల్లో శుక్రవారం సర్వేను పరిశీలించి మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఆర్ఐ ఖాజా మెయినుద్దీన్, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బోనకల్: మండలంలోని అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ళ సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ముష్టికుంట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ రమాదేవి పరిశీలించారు. చొప్పకట్లపాలెంలో తహసీల్దార్ పున్నం చందర్, ఆర్ఐ లక్ష్మణ్‌నాయక్ సర్వే తీరును పరిశీలించారు.



తల్లాడ: నూతనకల్‌లో ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజేందర్ గౌడ్

ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలి



చింతకాని: తహసీల్దార్ అనంతరాజుకు వినతిపత్రం అందిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

చింతకాని/ముదిగొండ: సమగ్ర ఇంటింటి సర్వేలో పాల్గొన్న ఎన్యూమరేటర్లకు డబ్బులను విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శులు తోటకూరి శ్రీనివాసరావు, ఎస్కే జహీర్, కోశాధికారి శచేంద్రబాబు కోరారు. ఈ సందర్భంగా చింతకాని, ముదిగొండ తహసీల్దార్లు అనంతరాజు, సునీత లకు వినతిపత్రాలు అందించారు. సమగ్ర ఇంటింటి సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ సంఘం శాఖ ఉపాధ్యక్షురాలు కవిత, నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాసచారి, రంగారావు, కృష్ణమూర్తి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చింతకాని మండల పరిషత్ సూపరింటెండెంట్‌కు వినతి..

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ షేక్ జానిమియాకు శుక్రవారం వినతిపత్రం అందించారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

కల్లూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం పోరాడాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వెంకన్న, జి.రామయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం కల్లూరు ఏఎంసీ కార్యాలయంలో నిర్వహించిన టీయూసీఐ ఏరియా మహాసభలో ఆయన మాట్లాడారు. 126 సంవత్సరాల క్రితం కార్మికవర్గం పోరాడి సాధించుకున్న సమ్మె హక్కుపై ప్రధాని మోదీ ప్రభుత్వం దాడి కొనసాగుతుందన్నారు. తెలంగాణలో వేతనాల కోసం పోరాడుతున్న ఆశ వర్కర్లను అరెస్ట్ చేయడం సరికాదన్నారు. మహాసభకు ముందు అరుణ పతాకాన్ని టీయూసీఐ జిల్లా అధ్యక్షులు వెంకన్న ఎగుర వేశారు. అనంతరం టీయూసీఐ కల్లూరు ఏరియా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బి.సత్యం, కె.పుల్లారావు, ఉపాధ్యక్షులుగా సీతయ్య, ఏడుకొండలు, సహాయ కార్యదర్శులుగా నాగేశ్వరరావు, మాల్యాద్రి, కోశాధికారిగా పున్నయ్యలతో పాటు మరో 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబు, అమర్లపూడి శరత్, ఎస్కే లాల్ మియా, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి లాజరు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఎగరేస్తున్న టీయూసీఐ నాయకులు

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం

సత్తుపల్లిటౌన్: సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో బస్సుల్లో ప్రయాణికులకు గులాబీ పువ్వులు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బస్సు ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి ప్రతి ఒక్కరూ గమ్యం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. 10శాతం రాయితీతో ఈ నెల 31వ తేదీ వరకు రాజధాని ఏసీ బస్సుల్లో ప్రయాణించవచ్చని తెలిపారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసే ప్రయాణికురాలు రేణుకను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్.సాహితీ, వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు పద్మావతి, సూపర్‌వైజర్లు సుబ్బారావు, వెంకటయ్య, నాగరాజు, కాంతారావు, వీబీటీ కిన్నెర ఆనంద్ పాల్గొన్నారు.



ప్రయాణికులకు గులాబీ పువ్వులు అందజేస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరురూరల్: మండల పరిధిలోని బత్తుపల్లి 133/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ పి.వెంకట్ తెలిపారు. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బత్తుపల్లి, ఎర్రబంజరు, కొర్లగూడెం, కొత్త నారాయణపురం, లక్ష్మీపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ వెంకట్ కోరారు.

తల్లాడ: తల్లాడ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తల్లాడ విద్యుత్ ఏఈ రాయల ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుంచి 10:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తుమ్మలను కలిసిన ఏఎంసీ చైర్మన్



మంత్రి తుమ్మలతో ఆనంద్‌బాబు

సత్తుపల్లి: రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్‌లో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, కల్లూరు కాంగ్రెస్ నాయకులు భాగం ప్రభాకర్ చౌదరి శుక్రవారం కలిశారు. సత్తుపల్లి, కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలను సెకండ్ గ్రేడ్ నుంచి స్పెషల్ గ్రేడ్ చేయాలని వినతిపత్రం అందించారు. రెండు మార్కెట్ కమిటీలకు మౌళిక సదుపాయాలు కల్పించాలని, కొత్త చెక్‌పోస్టులు మంజూరు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు.

తప్పులు పునరావృతం కావొద్దు..



సత్తుపల్లిలో తనిఖీ చేస్తున్న అధికారులు

సత్తుపల్లిరూరల్: ఉపాధిహామీ పథకం పనుల్లో తప్పులు పునరావృతం కాకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఈజీఎస్ ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ తనిఖీలో ఈజీఎస్ సిబ్బందికి రూ.40వేలు అపరాద రుసుము, రూ.25,889లు రికవరీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి జక్రియ, ఏపీడీ వెంకట్‌రాజు, అబుడ్స్‌మెన్ రమేష్, క్యూసి వీరయ్య, ఏపీఓ పవన్‌కుమార్, సూపరింటెండెంట్ శాస్త్రీ, ఎంపీడీఓ ఆర్.చిన్ననాగేశ్వరరావు, ఏపీఓ ఎం.బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలలో బాల సాహిత్య కార్యశాల



బాల సాహితీవేత్త సయ్యద్‌షఫీని సన్మానిస్తున్న ఎంఈఓ దామాల పుల్లయ్య

బోనకల్: మండలంలోని రావినూతల ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాల సాహిత్య కార్యశాలను బాల సాహితీవేత్త సయ్యద్‌షఫీ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ దామాల పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం సయ్యద్ షఫీని సన్మానించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మడుపల్లి విద్యార్థిని

మధిర: జిల్లాస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీల్లో మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కనకపుడి కావేరి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 31 నుంచి మహబూబ్ నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని హెచ్‌ఎం తోట నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన పీడీ మాధవరావును ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా మందా సైదులు



మందా సైదులు

మధిర: ఇటీవల సత్తుపల్లి పట్టణంలో నిర్వహించిన సీపీఎం జిల్లా 22వ మహాసభలో మధిర పార్టీ మండల కార్యదర్శిగా పనిచేస్తున్న మందా సైదులును జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నిక చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐలో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా జిల్లా కేంద్రంలో బాధ్యతలు నిర్వహించారు. మధిర మండలంలో పార్టీని మరింత ముందుకు తీసుకుపోవడం కోసం తమవంతు కృషి చేస్తానని మందా సైదులు తెలిపారు.

ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న నవీన్

సత్తుపల్లిటౌన్: ప్రతి విద్యార్థి ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలని ఇస్కాన్(ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కన్షియస్నెస్) ప్రచారకుడు నవీన్ అన్నారు. వాల్యూఆఫ్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మదర్‌థెరిస్సా స్కూల్, విశ్వశాంతి విద్యాలయాల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమాలలో మాట్లాడారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రచారకులు కిషోర్‌కుమార్, పాఠశాలల నిర్వాహకులు నాయుడు వెంకటేశ్వరరావు, పసుపులేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన దయానంద్



కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దయానంద్

సత్తుపల్లిరూరల్: సింగరేణి ప్రభావితమైన కిష్టారం, కొత్తూరు గ్రామాల రైతుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను శుక్రవారం రాత్రి ఖమ్మం కలెక్టరేట్‌లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ కలిశారు. ఈ సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, సింగరేణి పీఓ నర్సింహారావు, రైతులు పాల్గొన్నారు.

నేడు వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

సత్తుపల్లిటౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం సత్తుపల్లిలో ఘనంగా నిర్వహిస్తున్నామని ఆ పార్టీ నేత వనమారెడ్డి నాగిరెడ్డి అన్నారు. పాత సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించబడుతుందని, అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

'కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్'

కారేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీ పథకాలను అమలు చేయకపోగా.. ప్రతిపక్ష నాయకులపై కేసులు బనాయించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని సింగరేణి మాజీ జెడ్పీటీసీ వాంకుడోత్ జగన్ ప్రభుత్వాన్ని విమర్శించారు. శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెడితే బీఆర్ఎస్ నాయకులు చూస్తూ ఊరుకోదని, సీఎం వెంటనే కేసులను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, గౌసుద్దీన్, జుంకీలాల్, నాగరాజు, రాజు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మాలధారుల ఇరుముడి

కారేపల్లి: మండలంలోని గిద్దెవారిగూడెం ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణంలో అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం మండ్రు పుల్లయ్య, కేలోత్ రవి గురుస్వాముల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, మాలాధారులు ఉపేందర్, గోపికృష్ణ, లింగయ్య, కృష్ణ, రామారావు, శేఖర్, గణేశ్, ఆదినారాయణ, నాగేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు అందజేత



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న వీరభద్రరావు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామానికి చెందిన ఎస్ఆర్ఐ మండలంలో విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్న దాత కొండబోలు సురేష్ 70వ జన్మ దినాన్ని పురస్కరించుకుని ఆయన మిత్రుడు బెజవాడ వీరభద్రరావు పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, మిఠాయిలు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దొబ్బల శ్రీదేవి, జాకీర్, అంగన్వాడీ టీచర్ సుజాత పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ, గణిత పరీక్షలు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వక్తృత్వ, గణిత ఒలంపియాడ్ పరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఎం జయరాజు వక్తృత్వంలోని పది అంశాలను ఆవిష్కరించారు. ఈ పోటీల్లో లలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు జనవరి 3వ తేదీన బహుమతులు అందించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ చెరుకు శ్రీనివాసరావు, అరుణతార, అమీరియా, మాధవి, వెంకటేశ్వరరావు, ఉదయ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణ

వైరారూరల్: మండలంలోని కొండకొడిమ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం వైరా మండల ప్రత్యేకాధికారి కస్తాల సత్యనారాయణ ప్రారంభించి మాట్లాడారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ పొందాలన్నారు. ఏఈఓ వెంకటనర్సయ్య, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ కస్తాల వినోద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన హ్యూమన్ రైట్స్ నాయకులు



కల్లూరు ఎస్సై హరితకు శుభాకాంక్షలు చెబుతున్న హ్యూమన్ రైట్స్ నాయకులు

కల్లూరురూరల్: కల్లూరుకు నూతనంగా నియమితులైన ఎస్సై డి.హరితను శుక్రవారం ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రత్న తారక రాజన్న, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వినుకొండ శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హ్యూమన్‌రైట్స్‌కు సంబంధించి వివరాలను తెలిపారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమ 39వ వార్షికోత్సవాన్ని శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ బాధ్యులు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. పెనుగొండ ఉపేంద్రరావు, నాగేశ్వరరావు, చీరుకుమల్లి వాసవి, సీత, వృద్ధాశ్రమ నిర్వాహకులు పాల్ నరసింహరావు, విజయలక్ష్మి తదితరులున్నారు.

28 నుంచి ఏపీజీవీబీ సేవలకు అంతరాయం

ఎర్రుపాలెం: ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో విలీనం కానున్న క్రమంలో ఈ నెల 28వ తేదీ నుంచి 31వ వరకు ఏపీజీవీబీ ఖాతాదారుల సేవలకు అంతరాయం ఉంటుందని స్థానిక బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విలీనం కారణంగా ఖాతాదారు అకౌంట్ నంబర్ మారదని ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లో మార్పు ఉంటుందన్నారు. ఏటీఎం కార్డులు, మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్ సేవలు తిరిగి పొందాల్సి ఉంటుందని మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు.

మంచిమార్గం వైపు నడిపించడమే ధనుర్మాసం

సత్తుపల్లిరూరల్: రేజర్ల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస ప్రవచనం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఐదో రోజు శుక్రవారం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ ప్రవచనకర్త శ్రీరామన్ రామకృష్ణమాచార్య స్వామి మాట్లాడుతూ.. ప్రతీ మనిషిలో కూడా మంచి, చెడు రెండు కోణాలు ఉంటాయని, మనిషిలో దాగి ఉన్న మంచిని పెంపొందించేటటువంటి కాలం ఈ ధనుర్మాస కాలమని వివరించారు. భగవంతుడిని నమ్మి కొలిస్తే ఏదైనా పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



ప్రవచనం వినిపిస్తున్న శ్రీమాన్ రామకృష్ణమాచార్య స్వామి